# నాగబంధం

జనమనోరంజకం విజయనగర్ సామ్రాజ్యం రాజధాని విజయనగరం... నిత్య కల్యాణం పచ్చతోరణం. పాలకుల హృదయాల్లా సువిశాలమైన రాజవీదులు, ఎత్తైన రంగుల మేడలు, బాటలకిరువైపులా బారులు తీరిన చెట్టకొమ్మలు, రెమ్మలతో సయ్యాటలాడిన పిల్లగాలులు బాటసారులకు గిలిగింతలు పెడ్తున్నాయి.

పాలనురగలాంటి తెల్లని గుర్రమ్మీద ఓ నవయువకుడు రాజభవనం వైపు ఠీవిగా వెళ్తున్నాడు. వడితిరిగిన కండరాలు, వెడల్పాటి ఛాతీ, పిక్కల మీద నాట్యం చేస్తున్న అంగరఖా అంచులు, మెడలో మేలిరతనాల హారం, తలపై మణి-మాణిక్యాలు పొదిగిన తలపాగా... హుందాతనానికి వన్నెలు దిద్దుతున్నాయి. అలవాటు ప్రకారం సూర్యోదయానికి మూడు ఘడియలు ముందే నిద్రలేచి, వ్యాయామశాలకెళ్లి రకరకాల కసరత్తులు చేశాడు. వీరమల్లుతో ఖుషీగా కుస్తీలు పట్టాడు. సర్దారులతో ఖడ్గయుద్ధం అభ్యాసం చేస్తూ మెరుపులు మెరిపించాడు. వస్తాదులతో ఒంటికి తైలమర్దనం చేయించుకున్నాడు.

వీధిలో ఎదురైన జనానికేదో వరాలమూట దొరికినట్టు 'అదుగో కృష్ణదేవరాయలు. కాబోయే మహారాజు....' మురిసిపోతూ గుసగుసలాడుతూ పక్కకు తప్పుకున్నారు.

శ్వేతాశ్వం లయబద్ధమైన అడుగులతో ముందుకు పరుగె,డుతోంది. కృష్ణదేవరాయల ఎడపొదలో నాగాంబిక నవ్వుల పువ్వులు అల్లరిపెడుతున్నాయి. నాగాంబిక అందాలరాశి. కానీ... ఆమెను పెంచి పోషిస్తున్న తిప్పసాని నలుగురి చేతుల్లో నలిగిపోయే పూలదండ. తాను వేశ్యావృత్తిలో ఉన్నా నాగాంబను గారాబంగా 'చిన్నాదేవీ!' అని పిలుస్తూ బురదగుంటలో పద్మంలా పెంచింది. తన వృత్తి ఛాయలామె కంటించలేదు. పచ్చిపాలలో సాయపసుపు రంగరించిన దేహఛ్ఛాయ. విప్పారిన నల్లకలువల్లా విశాల నేత్రాలు, నడకలో యమూరగతి, నవ్వులో నవరత్నాలొలికించే నాగాంబిక తన గుండెల మీద పూవులా వాలి "ప్రియా! నన్ను అర్ధాంగిగా స్వీకరిస్తే. నా అందచందాలన్నీ శాశ్వతంగా నీవేగదా!" వేలిమొనలతో సన్నని మీసం కట్టును తడిమింది. నవజవ్వని అదరామృతాన్ని రుచి చూడాలనే ఆరాటం సయ్యాటలాడ్తోంది.

"సుందరీ! రాచరికం కట్టుబాట్లతో పెరిగిన నా మనసును మలుపు తిప్పిన నాట్యమయూరివి. నిన్ను వదులుకుంటానా?" పెదాలతో పెదాలందుకోబోయాడు. ఒడిలోంచి జారిపోయింది. "ఈ చిలిపి చేష్టలన్నీ మన పెళ్లయింతర్వాతనే. యువరాజా!" కిలకిలా నవ్వింది. ఆ నవ్వు కావేరీ ప్రవాహం సవ్వడిలాగుంది.

తియ్యని అనుభవాల కమ్మని అనుభూతులు నెమరువేస్తూంటే కోట ద్వారాలు బార్లా తెరుచుకున్నాయి. అరెరే! మనిషిగా గుర్రమ్మీదున్నా మనసు ఆ సుందరి చుట్టే తిరుగుతోంది. గదూ!... తనలో తాను నవ్వుకున్నాడు. 'చిన్నా' అని పిలిపించుకుంటున్న నాగాంబ గురించి అప్పాజీకి చెప్పాలి.

xxxxx

"ఏమండీ! మహామంత్రిగారూ! విజయనగర సామ్రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న మహామంత్రిగారూ!" సన్నిహితులతో "అప్పాజీ!" అని ప్రేమగా పిలిపించుకుంటున్న తిమ్మరుసు భార్య పలుకరించింది. ఇంటిలో కూచున్న తిమ్మరుసు మనసు మరో లోకంలో విహరిస్తోంది. మొహమ్మీద విషాదఛాయలు. భార్య ఆశ్చర్యంగా బుగ్గలు నొక్కుకుంది.

అరివీర భయంకరుడైన అప్పాజీ అలా విషణ్ణవదనులై కూచున్నారేమిటి? తుళువ వంశీయుల సమర్థపాలనలో కీలకపాత్రధారి అప్పాజీ అలాగయారేమిటీ? వీరనరసింహరాయల వారి కుడిభుజమైన మహామంత్రి ఏమాలోచిస్తున్నట్టూ? దీర్ఘరోగంతో మంచమ్మీద పడున్న మహారాజుకేమీ కాలేదు గదా! పెద్దరాణి తిప్పాంబిక ఏదన్నా ఉపద్రవం సృష్టించలేదు గదా! అవిడ ఎనిమిదేళ్ల కొడుకుకేమీ కాలేదు గదా! శ్రీకృష్ణదేవరాయలను బాల్యం నుంచి పెంచి సకల విద్యాపారంగతుడిగా మలచిన మమానీయుడేనా ఇతను? తన కన్నకొడుకులా పెంచుకున్న కృష్ణదేవరాయలు ఈయననిలా చూస్తే ఏమనకుంటాడో...

నిశ్చేష్టురాలై నుంచున్న భార్యకంతా అగమ్యగోచరంగా ఉంది. ముత్యాల ముక్కుపుడకను తడుముకుంటూ దగ్గరికొచ్చింది. కుడిభుజాన్ని సున్నితంగా అదిలించి "మిమ్మలనిలా ఎన్నడూ చూడలేదు సుమా! ఏమైందనీ?" మొహంలోకి చూసింది.

"ఇంకేమీ కాలేదు. కానీ... ఇకముందు అనుకోనిదేదో జరిగేలాగుంది దేవీ!" ఆసనమ్మీద సర్దుక్కూచున్నాడు.

"అదేమిటండీ!" పాదాల వద్ద నేలమీద కూచుంది.

"యువరాజు కృష్ణదేవరాయలు మన కన్నకొడుకులా మనింట్లోనే పెరుగుతున్నాడు కదా!" కనుబొమ్మలు, నుదుటిగీతలు వంకర్లు తిరిగాయి. నుదుటి విభూతి రేఖలు గూడా వంకర్లు తిరిగాయి.

"అవును. కాదని ఎవరన్నారండీ?" కనుబొమ్మలు పీటముడేసుకున్నాయి. కుంకుమ బొట్టు ఉదయార్కునిలా మెరుస్తోంది.

"మహారాజు వీరనరసింహరాయల వారి సవతితల్లి కుమారుడైనా మనపిల్లల్తో కలిసి పెరుగుతున్నాడాయె. పొద్దున్నే వ్యాయామశాల కెళ్లాడు. కాస్సేపట్లో తిరిగొస్తాడు. రాగానే ఏమవుతుందో?"

"అం...టే... చిరంజీవి కృష్ణదేవరాయల కేదన్నా కీడు...!"

"యువరాజు కృష్ణదేవరాయల ప్రాణాలు తీయించమని మహారాజు నన్నే ఆదేశించారు దేవీ!" గొంతు వణికింది.

"అయ్యయ్యో!" కేకేసింది. నెత్తిమీద పిడుగు పడ్డట్టైంది. "ఇదేమి రాజకకీయ కుతంత్రమండీ?" అంతరాళాల్లో కరిగిన ఆవేదన బిందురూపమై కళ్లల్లో మెరిసింది. "కృష్ణరాయుడు చేసిన తప్పేమిటటా?"

"రాజసింహాసనానికి వారసుడుగా జన్మించడమే. అతన్ని చంపించి రెండు కళ్లు తెచ్చి చూపించమని ఆదేశం. రాజకీయానికి బంధుత్వాలు, బాధ్యతలు ఏవీ కనబడవు."

"అదెలాగండీ?"

"మహారాజు వీరనరసింహరాయల వారి ముద్దుల పెద్ద పెళ్లాము తిప్పాంబిక ఎనిమిదేళ్ల కొడుక్కు సింహాసనం దక్కాలంటే పెద్దవాడు కృష్ణదేవరాయలు బతికుండగా కుదరదుగదా!"

"అయ్యో భగవంతుడా!" తలబాదుకుంది. గుండెల్లోంచి తోసుకొస్తున్న దుఃఖాన్ని పెదాల బిగువున అదిమి పెట్టింది. "కావాలంటే నా ప్రాణాలిస్తాను. నన్ను చంపి నా కళ్లు తీసుకెళ్లి మహారాజుకు చూపించండి. నా బిడ్డనేమీ చేయకండి." ప్రాధేయడింది.

"నీ ప్రాణాలెవరిక్కావాలీ? మహారాజును కొనకొంగుకు ముడేసుకున్న ఆ తిప్పాంబిక కుతంత్రమిది.

తన కొడుక్కే సింహాసనం దక్కాలని ఎత్తువేసింది. మరణశయ్య మీదున్న మహారాజును ఒప్పించి ఆదేశం జారీ చేయించింది."

"హమ్మో! రాజకీయ చదరంగంలో ఇంత నీచాతి నీచమైన ఎత్తులుంటాయా?"

"ఉంటాయి దేవీ!" త్రేతాయుగంలో దశరథమహారాజు చిన్న భార్య కైకేయి మాటను కాదనలేక శ్రీరామచంద్రుడిని అడవులకు పంపించలేదా? రాజకీయ రంగంలో అప్పుడప్పుడు నైతిక విలువలు ఆత్మహత్య చేసుకుంటాయి."

"వీల్లేదు. ఇదన్యాయం... అక్రమం... దీనికేదైనా ఉపాయమాలోచించి అపాయం నుంచి రక్షించండీ!" గాజుల చేతులెత్తి మొక్కింది.

"అదే ఆలోచిస్తున్నాను దేవీ... కృష్ణదేవరాయలొచ్చే వేళైంది." గుమ్మం వద్ద అలికిడైంది. దృష్టి అటు మళ్లింది. గోడలమీద తైలవర్ణచిత్రాలు చిత్రంగా చూస్తున్నాయి. కృష్ణదేవరాయలు ఠీవిగా అడుగులేస్తూ లోపలికొస్తున్నాడు.

"అదేమిటమ్మా... అలాగున్నారేమిటీ?" అంగరఖా దగ్గరగా ముడుచుకుని ఎదుటి ఆసనమ్మీద కూచున్నాడు. ఐదారు క్షణాలు మౌనం. "ఏమైంది అప్పాజీ?" అయోమయం.

"కుమారా కృష్ణా!" గొంతునిండా బాధ. పెంచిన తల్లిప్రేమ చేతులతో చెంపలు నిమిరింది.

"కృష్ణరాయా!" అప్పాజీ లేచి నుంచున్నాడు. మన హంపీ విజయనగరం రాజకుటుంబంలో ప్రాణాలతో చెలగాటాలాడుతున్నారు నాయనా!"

"మా అన్నగారి ప్రాణాలు...!?"

"మహారాజు ప్రాణాలతోనే ఉన్నారుగాని తమరి ప్రాణాలకే ప్రమాదం ముంచుకొచ్చింది కుమారా!" అంతరాళాల్లో ఆందోళన.

"నా ప్రాణాలు హరించే వారెవరు అప్పాజీ?" నవ్వేశాడు.

"నేనే కుమారా!" గొంతు గద్గదమైంది. "అది రాజాజ్ఞ"

"మీరా? నెత్తిమీంచి కిరీటం జారిపడింది. "కన్నవారి ప్రేమకు నోచుకోని నన్ను వాత్సల్యంతో పెంచిన మీ రుణమిలా తీరుతుంది. అయినా నా ప్రాణాలెందుకటా?" తైలవర్ణ చిత్రాలు వికారంగా కనిపిస్తున్నాయి.

అప్పాజీ మొహంలో గాంభీర్యం పులుముకుంది. విషయమంతా వివరించి చెప్పాడు. చివరికి "అందుకు నా మనసంగీకరించడం లేదు కుమారా!" గొంతు నుంచి పాకిన ఆందోళన కళ్లల్లోకొచ్చింది.

"అందుకే ఆయన మదనపడుతున్నారు నాయనా!" భార్య నోటికి కొంగు అడ్డం పెట్టుకుంది. కళ్లు చెప్పిల్లాయి.

"దానికి బాధెందుకు అప్పాజీ!" కృష్ణదేవరాయల మందహాసం. చిన్నవాడు సంహాసనమెక్కితే నేను అడ్డు రాను. అడవుల్లోకెళ్లి సన్యాసం పుచ్చుకుంటాను. మహారాజుకు చెప్పండి."

"దీన్ని మహారాజుగారు తప్పకుండా అంగీకరిస్తారండీ!" పెంచిన తల్లి ఆరాటం.

అప్పాజీ అంతరాత్మకు ఓ జీవన సత్యం గోచరించింది. మస్తిష్కంలో తర్కవితర్కాలు చెలరేగాయి.

వాలకం మారింది. ఏదో నిర్ణయం జరిగిపోయిందని ముఖకవళికలు చెప్తున్నాయి.

xxxxx

రోగ తీవ్రతను తట్టుకోలేక మహారాజు వీరనరసింహరాయలు పట్టుపరుపు మీద అల్లాడిపోతున్నాడు. ఊపిరితిత్తులు కొలిమి తిత్తుల్లా ఎగిరిపడ్తున్నాయి. లోతుకుపోయిన కనుగుడ్లు నీరు దిగిన ముత్యాల్లా మెరుస్తున్నాయి. మనసు పెద్దభార్య, ఆమె కుమారుడు ద్వితీయ నరసింహరాయల చుట్టూ గిరికీలు కొడుతుంది. సేనాధిపతులు, మంత్రులు, భార్యలు, బంధువులు ఆందోళనగా చుట్టూచేరి చూస్తున్నారు.

మహామంత్రి తిమ్మరుసు కనిపించగానే మహారాజు చేతిసైగలతో అంతా బయటికెళ్లిపోయారు. తిమ్మరుసు మహారాజుకు సవినయంగా నమస్కరించి "పని పూర్తయింది మహారాజా!" కళ్లను చూపించాడు. మహారాజు తృప్తిగా నిట్టూర్చాడు. "ఇహ మీవాడికే రాజమకుటం దక్కుతుంది మహారాజా!" చెవిలో చెప్పాడు మహామంత్రి. మహారాజు శరీర పంజరంలోంచి ప్రాణం పక్షి ఎగిరిపోయింది. రాణులు గొల్లుమన్నారు.

xxxxx

మహామంత్రి తిమ్మరుసు ఏర్పాటు చేసిన సభలో మంత్రులు, సేనానాయకులు, ప్రముఖ పౌరులు కొలువుదీరారు. మెడల్లోని నవరత్న హారాలు పట్టు అంగరఖాలను మెరిపిస్తున్నాయి. వాతావరణం గాంభీర్యాన్ని పులుముకుంది. రంగుల కుడ్య చిత్రాలు హంపీ విజయనగర సామ్రాజ్యాధిపతిగా ఎవరిని ఎంపిక చేస్తారోనని ఆసక్తిగా చూస్తున్నాయి.

"ఆత్మీయులారా! రాజ్యశ్రేయోభిలాషుల్లారా!" మహామంత్రి తిమ్మరుసు సభాసదుల ముఖకవళికలను పరిశీలిస్తున్నారు. "మన హంపీ విజయనగర సామ్రాజ్యానికి మీరు మూలస్తంభాలు. సాళువ వంశీయుల ఆధీనంలోంచి ఈ సామ్రాజ్యాన్ని తుళువ వంశీయుల పాలనలోకి తెచ్చిన మహారాజు వీరనరసింహరాయల వారసులెవరో మనం నిర్ణయించాలి. మన ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మీ అభిప్రాయాలను చెప్పండి..." మరిన్ని అంశాలు వివరించాడు.

చర్చ ప్రారంభమైంది. ఎవరి అభిప్రాయాన్ని వారు నిర్మొహమాటంగా వెల్లడిస్తున్నారు.

"మహామంత్రివర్యా!" ముఖ్యసేనాధిపతి లేచినుంచున్నాడు. "ఈ సామ్రాజ్యానికి మీరు వెన్నెముక వంటివారు. మిమ్మల్ని ప్రేమగా అప్పాజీ అని పిలుచుకుంటున్నాం. అప్పాజీ అంటే నాన్నగారు అనే అర్థముంది. ఈ సామ్రాజ్యానికి మీరు తండ్రి. ఈ ఎంపిక బాధ్యతను మీకే అప్పగిస్తున్నాం" అందరి మనోసాగర తరంగాల ధ్వని వినిపించాడు. కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

"అన్ని రంగాల్లో ఆరితేరిన శ్రీకృష్ణదేవరాయలవారు బతికుంటే ఈ సమస్య తలెత్తేది కాదు. వారిని చంపించడం భావ్యం కాదేమో!" సర్వసేనాధిపతి విచారం వెలిబుచ్చాడు. "ఇహ మిగిలింది ఎనిమిదేళ్ల ద్వితీయ వీరనరసింహరాయలే గదా!"

తిమ్మరుసు పెదాల మీదో చిరునవ్వు తళుక్కుమని నుదుటి తిలకం బొట్టును మెరిపించింది. "మీకో శుభవార్త. యువరాజు శ్రీకృష్ణదేవరాయలు సజీవంగా, క్షేమంగా ఉన్నారు."

సభలో కలకలం బయలుదేరింది. "మీరే చంపించి వారి కళ్లను తెచ్చి మహారాజుకు చూపించారు గదా!" అన్నారొకరు.

"మతిస్థిమితం లేని మహారాజు మరణశయ్య మీదుండి శ్రీకృష్ణదేవరాలను చంపించమన్నది నిజమే. కానీ ఈ సువిశాల హంపీ విజయనగర సామ్రాజ్య ప్రజాభ్యుదయాన్ని దృష్టిలో పెట్టుకుని నేను కృష్ణదేవరాయలను రహస్యంగా చంద్రగిరి పంపించాను. మేకకళ్లు తెచ్చి మహారాజుకు చూపించాను. దాంతో ఆ మహారాజు తృప్తిగా ప్రాణాలొదిలారు." తిమ్మరుసు అనగానే సభలో సంతోష తరంగాలెగిసి పడ్డాయి.

"మరైతే వారేరి? చూపించండి అప్పాజీ!" అందరి ఆశ. మహామంత్రి భటులను పిలిపించి "యువరాజు శ్రీకృష్ణదేవరాయల వారు చంద్రగిరి నుంచి వచ్చి మా ఇంట్లో ఉన్నారు. వెళ్లి సగౌరవంగా తీసుకొద్దాం పదండి." ఆదేశించాడు.

యువకిశోరం శ్రీకృష్ణదేవరాయలు సభలో ప్రవేశించగానే సభ చప్పట్లతో మార్మోగింది. జయజయధ్వానాలు మిన్నుముట్టాయి.

xxxxx

తెలుగు వెలుగుల చరిత్ర పుటల్లో 26 జూలై 1509. పుణ్యనదీ జలాల స్నాతయై శ్రీకృష్ణదేవరాయలు వేదమంత్రాల మధ్య హంపీ విజయనగర సామ్రాజ్యాధిపతిగా పట్టాభిషిక్తుడు అయ్యాడు. పాలనాపగ్గాలు కొన్ని నెలల తర్వాత చేపట్టాలని, అంతవరకూ తిమ్మరుసు సలహా సంప్రదింపులతో అనుభవం గడించాలని పెద్దలు నిర్ణయించారు.


ఏకాంత మందిరం... తిమ్మరుసు ముందు శ్రీకృష్ణదేవరాయలు ఆసీనుడైనాడు. గుండెలో గూడుకట్టుకున్న నాగాంబికతో తన ప్రేమ వ్యవహారం విప్పిచెప్పి, ఆమెనే అర్ధాంగిగా స్వీకరిస్తానని సవినయంగా చెప్పాడు. అప్పాజీకా విషయం అంతకుముందే తెలుసు.

"మహారాజా" అప్పాజీ మందహాసం. ఒక వేశ్య కనుసన్నల్లో పెరిగిన పవిత్ర యువతి నాగాంబికను తమరిప్పుడే పెళ్లాడితే లోకం హర్షించదు. మహారాజు వ్యక్తిత్వం గురించి ఎవ్వరూ వేలెత్తిచూపే ఆస్కారమివ్వొద్దు. కాబట్టి మొదట మన సేనాధిపతి వీరయ్య పుత్రిక, సౌందర్యదేవత తిరుమలాంబను పెళ్లాడండి. ఆతర్వాత నాగాంబిక చిన్నమాదేవియై మీ భార్య అవుతుంది. మొదటి భార్యనే పట్టపురాణి అవుతుంది."

ఆ మాటలకు శ్రీకృష్ణదేవరాయల ఎదలో అమృతపు జల్లు కురిసింది. యువముఖారవిందం సహస్రదళాలుగా విచ్చుకుంది.

--- x ---

(తెలుగు వెలుగు, జనవరి-2013)



కథా నిలయం శ్రీకాకుళం